స్కెచ్

# ప్రేమస్వరూపం

కొండేపూడి సూర్యకామరాజు

'ఒరేయ్, ఆ రిక్షాలో వస్తున్న అమ్మాయిని చూశావా?'

'ముద్దుల మూటకట్టే ఆ మెముద్దుముఖం చూడకుండా ఎవ డుంటార్రా?—రెండు నెల్లనించి చూస్తున్నా. నేను బస్సుకోసం నిలబడటం, ఆ అమ్మాయి వెలుతురు వెదజల్లుకుంటూ రిక్షాలో రావటం రోజూ జరుగుతున్నదే.'

'ఆ అమ్మాయి ఎప్పుడన్నా నీకేసి చూసిందా?'

'ఎప్పుడన్నా ఏమిటి?—రోజూ చూస్తోంది. చూడటంలో అట్లాయిట్లా కాదు. ఊపిరి సలపకుండా చూస్తోంది—చూడు, ఎట్లా చూస్తోందో.'

'నిజమేరోయ్ - మరి యిన్నాళ్లూ దద్దమ్మలాగ వూరుకున్నావేం?'

'ఊరుకోక ఏంచెయ్యమంటావ్?'

'ప్రేమలో దిగలా?'

'దిగటమేమిటి?-దూకాను...మునిగాను.'

'అయితే ఆ అమ్మాయితో చెప్పెయ్యకూడదూ, ఆ సంగతి?'

'చెప్పేవాడినే కాని మొన్న బస్సుమీంచి పడ్డప్పటినుంచీ పళ్లు కదుల్తున్నాయి. వ్యవహారం బెడిసికొడితే పళ్లుకాసిన్నీ...'

'ప్రేమకోసం ఎందరో ప్రాణాలే పోగొట్టుకొంటుంటే పళ్లు రాల్తాయని భయపడే నీకు - నీ మొహం - ప్రేమేమిట్రా?'

'ఒరేయ్, నన్నుత్త దద్దమ్మకింద కట్టేశావ్- చూడు, రేపు అడక్కపోతే.'

* * *

'అబ్బాయ్, ఎన్నిసార్లడిగినా చెప్పవేంరా? పిల్ల నచ్చిందా?'

'అబ్బ, ఎవరే? - ఏ పిల్లా?'

'ఏ పిల్లేమిట్రా - మొన్ననేగా గుంటూరు వెళ్లి చూసొచ్చావ్.'

'అవును, చూశాను.'

'బాగుందా?'

'కాళ్లూ చేతులూ బాగానే వున్నాయి.'

'ముఖం అదీ లక్షణంగా వుందా?'

'ముఖం చూడలేదు - ఇంక -అదీ అంటే ఏమిటో నాకు తెలీదు.'

'మరీ శోధ్యం - ముఖం చూడకుండా కాళ్లూ వేళ్లూ చూసొచ్చావా?'

'నేనేం చేసేదే, ముఖం తీసుకెళ్లి ఒళ్లో కప్పెట్టుకుంటే? - వీపు చూశాను. చదునుగానే వుంది. జడ చూశాను, పొట్టిగానే వుంది - ఇంకేం కావాలీ?'

'బాగుంది నాయనా-పదివేలిస్తామని కాళ్ల దగ్గరకు వచ్చిన బెజవాడసమంధం అట్లాగే దాటబెట్టావ్-ఎన్నాళ్ళని దొంగత్తేసి పెళ్ళి తప్పించుకుంటావురా?'

'నాకు నచ్చిన పిల్ల దొరికేదాకా'

'ఇప్పటికి పాతికమందిని చూశావు. వాళ్లలో ఒకత్తీ నచ్చలేదా, అదో వంకకాని.'

'నేను చూశా నేమిటి ?—నువ్వు బలవంత పెట్టి చూపించావు—అమ్మా,నే నొక్కటి చెప్తా విను. నలుగురు పట్టుకుని గుడికి మేకపోతుని తీసుకువచ్చినట్టు నాముందుకి తీసుకువచ్చిన పిల్లని చూసి పెళ్ళి చేసుకోవటం కల్ల.'

'మరి బడుద్ధాయి బ్రహ్మచారిగా వుండిపోతావా?'

'ఉండనమ్మా వుండను. పెళ్ళి చేసుకుంటా—గృహస్థుణ్ణవుతా—పిల్లల్ని కంటా—ఇల్లాల్ని నీ చెప్పు చేతల్లో వుంచుతా—నీ ముచ్చట్లన్నీ తీరుస్తా.పెళ్లాన్ని మాత్రం నన్నే వెతుక్కోనియ్.'

'ఏమో నాయనా, నీ యిష్టమొచ్చినట్టు చెయ్యి-బరి తెగించినవాళ్ళ కెవరు చెప్తారు!'

* * *

'ఏయ్ రిక్షా, ఒక్కసారి ఆపు—ఏమండీ మిమ్మల్ని ప్రేమించాను.'

'సంతోషం. రిక్షా ఎక్కండి మాట్లాడుదాం- ఏయ్, రిక్షా తిప్పి యింటికి పోనియ్.'

'మిమ్మల్ని ఎంత గాఢంగా ప్రేమించానో తెలియ చెయ్యాలంటే ఏం చెయ్యాలో తెలీటం లేదు.'

‘గాఢంగా మాత్రం ఏం చెయ్యకండి—రిక్షా తలక్రిందు లవకలదు.’

‘ప్రపంచం తలక్రిందులయినా సరే నా ప్రేమ అనంతం.’

‘అంత గాఢంగా ప్రేమించటానికి నాలో ఏముందండీ?’

‘మీ పెదవులు అమృతం వర్షిస్తయి. మీ బుగ్గలు గులాబీలు పూస్తయి.’

‘అయితే ఏం చెయ్యమంటారు?’

‘పెళ్లాడమంటాను.’

‘పెళ్ళయాక ఏం చేస్తారు?’

‘నా ప్రేమ నగరుకి మిమ్మల్ని చైర్మన్ చేస్తాను. మీ అధరామృతాన్ని తనివితీరా తాగి మీ చీరె కొంగుతో మూతి తుడుచుకొంటాను.’

‘మీమాట లెట్లా నమ్మటం?’

‘నా హృదయం చీల్చి చూడండి. మీరు నన్ను నిరాకరిస్తే అవొచ్చే లారీ క్రిందపడి చితికి పోతా—ఊఁ...దూకేస్తున్నా.’

‘ఒద్దొద్దు. పెళ్లాడుతా-దూకకండి.’

‘నాజన్మ తరించింది.’

‘నాపూజ ఫలించింది.’

‘ప్రేయసీ, నీ పేరు?’

‘ప్రేమ’

‘అబ్బ, ఎంత చక్కటిపేరు! వీణాతంతువులు వేళ్ళసహాయంలేకుండానే అక్షరలక్షలుచేసే ఆ రెండక్షరాల్నీ సర్వదా ప్రతిధ్వనింపచేస్తూ వాతావరణాన్నంతా నింపేస్తయ్. సర్వాంతర్యామివైన నిన్ను వదలి ఎక్కడకు పోగలను!'

‘నా చేతుల్లో సత్తు వున్నంతకాలం మిమ్మల్ని వదల్ను—నాథా, మీ నామ ధేయం?’

‘గణపతి’

‘ఎంత పూజ్యమైనపేరు! — నా ప్రేమ పుష్పాలతో మిమ్మల్ని రోజూ పూజిస్తాను.’

‘నువ్వు నడిచే తోవంతా పూలమొక్కలు నాటుకుంటూ పోతాను.’

‘మీకు రోజూ ఉండ్రాళ్లు చేసిపెడతాను.’

‘అ...బ్బ, ప్రేమా...’

‘అబ్బవొదలండి, యింటికొచ్చేశాం’

‘ఉండు—నే దింపుతా’

‘ఒద్దు, చెయ్యి అందివ్వండి చాలు-అమ్మయ్య. పెధవరిక్షా, కూర్చున్నంతసేపూ బాగానేవుంటుంది. కాని దిగటం వచ్చేసరికి తాతలు దిగొస్తారు.’

‘ఇంక రిక్షా ఎందుకూ?—మంచి కారు కొంటాగా...అదేం కుంటుతున్నావేం?—ముల్లు విరిగిందా?’

‘లేదు—నా కుడికాలు కొంచెం కుంటిది లెండి...అయ్యో, అట్లా వొణికిపోతున్నారేం? ముఖంనిండా ఆ చెమటేమిటి?—పడకండి, పడకండి—అబ్బీ, ఆయన్ని యింట్లోకి తీసుకురా—ఊఁ త్వరగా’

* * *

‘అబ్బాయ్, గంటనించి నీ కోసం కనిపెట్టుకున్నాను-అన్నానికి రావేం?’

‘.........’

‘ఎందుకీ అలక?’

‘అలకాలేదు, గిలకాలేదు- నా కాకల్లేదు.’

‘.........’

‘తాసిల్దారుగారి ఆడవాళ్లు వచ్చే వేళయింది. నువ్వు కాస్త తల దువ్వుకుని బట్టలు కట్టుకోకపోతే బాగుంటుందా?’

‘.........’

‘వాళ్లమ్మాయి కార్లో కాలేజీకి పోతుంటే బురదనీళ్లు నీ మీద చిందాయిట. ఆరోజు మొదలు నిన్నుతప్ప పెళ్లాడనని కూచుందిట!’

‘.........’

‘పదిహేనువే లిస్తారుట.’

‘.........’

‘పెద్దమేడ పిల్లపేర రాస్తారుట.’

‘.........’

‘ఆ అమ్మాయి ఎంత అందంగా వుండను కున్నావ్ - వెతుకుదామన్నా వంక కనపడదు.

‘అమ్మా, ఏమయితే ఏం లాభం - నా పెళ్లి నిశ్చయమై పోయింది.’

‘నాకు తెలియకుండానే! - ఎవరు నాయనా ఆ అప్సరస?’

‘...ప్రే...మ.’

‘కుత్తుకవెంటివా రమ్మాయా!’

‘.........’

‘అయ్యో, ఎంతపని చేశావురా - ప్రేమ కుంటిది.’

‘కాదమ్మా!-ప్రేమ గుడ్డిది!’